

రిటైర్మెంట్ పండగ..!

47 మందిని సన్మానించిన ఎస్కేయూ యాజమాన్యం



ఉద్యోగులను సతీసమేతంగా సన్మానిస్తున్న వీసీ అనిత, ఇతర అధికారులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో బోధనేతర ఉద్యోగుల రిటైర్మెంట్‌ను వర్సిటీ యాజమాన్యం శనివారం పండుగలా నిర్వహించింది. 47మంది ఉద్యోగులను వారి కుటుంబ సమేతంగా సత్కరించింది. ఈ వేడుకలు శనివారం ఎస్కేయూ భువన విజయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభకు ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, అతిథులుగా రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ అనిత మాట్లాడుతూ వివిధ విభాగాల్లో అటెండర్ నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్ వరకు సేవలందించిన వారిని సత్కరించుకోవడం వర్సిటీ సంప్రదాయమన్నారు. గత ఐదేళ్లుగా బోధనేతర ఉద్యోగుల రిటైర్మెంట్ ఫంక్షన్ నిర్వహించలేదన్నారు. అందుకే గత ఐదేళ్లుగా ఉద్యోగ విరమణ చేసినవారందరికీ ప్రస్తుతం సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ వీసీగా రామకృష్ణారెడ్డి ఉన్నప్పుడు నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను పురుగుల్లాగ చూశారని ఉద్యోగ వర్గాలు గుర్తు చేసుకున్నాయి. నోటీసులు, సస్పెండ్‌లు, ఇంక్రిమెంట్ కటింగ్‌లు ఇలా అనేక రకాలుగా కక్షసాధింపు చర్యలకు బలయ్యామని వాపోయారు. ప్రస్తుత యాజమాన్యం రిటైర్మెంట్ ఫంక్షన్ నిర్వహించడం ఆనందంగా ఉందని సంబరపడ్డారు.

హై అలర్ట్..!

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో జిల్లాలో ఎస్పీ జగదీష్ హై అలర్ట్ ప్రకటించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని రద్దీ ప్రాంతాలలో అనుమానితులు, లగేజీలు, పార్శిళ్లను పోలీసులు శనివారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులు, జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో బాంబ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీ చేశాయి. జిల్లా అంతటా ఏకకాలంలో తనిఖీలు కొనసాగాయి. బస్సులు, రైళ్లు, పార్శిల్ సర్వీస్ కార్యాలయాలను తనిఖీ చేశారు.

పాకిస్థానీలు ఉంటే వెళ్లిపోండి

కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ దేశీయులు జిల్లాలో ఉంటే తక్షణమే వెళ్లిపోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీచేశారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాకిస్తానీల వీసాలను రద్దుచేసిందన్నారు. లాంగ్ టైమ్ వీసా, డిప్లొమాటిక్ అండ్ అఫిషియల్ వీసాలు మినహాయించి ఇతర అన్ని రకాల వీసాలను రద్దు చేశామని పేర్కొన్నారు. ఈనెల 29 నాటికి వీసాలను సైతం రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. ఇంకోవైపు కొత్తవీసాలు జారీచేయబోమన్నారు. వీసాలతో ఎవరైనా పాకిస్తానీలు ఉంటే తక్షణమే ఆదివారం సాయంత్రంలోగా జిల్లా వదిలి వెళ్లిపోవాలన్నారు. మెడికల్ వీసాలు ఉన్న పాకిస్తానీలు ఈనెల 29వ తేదీలోగా జిల్లాను వదలివెళ్లాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

అక్కా... నీ కాళ్లు మొక్కుతా..
నీటిని వృథా చేయవద్దు..!



కొండకింద వీధిలో మహిళ కాళ్లు మొక్కుతున్న కాంట్రాక్టర్ హరినాథ్ రెడ్డి

'అక్కా.. నీకాళ్లు మొక్కుతా..! నీటిని వృథా చేయకండి' అంటూ ఓ మహిళ కాళ్లు మొక్కాడు ఓ కాంట్రాక్టర్. అనంతపురం జిల్లా యాడికి మండల కేంద్రంలోని కొండ కింద వీధిలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. నీటిని వృథాగా వదిలేసిన ఓ మహిళ కాళ్లకు క్లాస్ వన్ కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి మొక్కారు. యాడికిలో పలు కాలనీల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంగోపాల్ రెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ హరినాథ్ రెడ్డికి ఎమ్మెల్యే సూచించారు. వారు రంగంలోకి దిగి, పట్టణంలోని బోరుబావులు, తాగునీటి ట్యాంకుల వద్ద మరమ్మతు పనులు చేయించారు. పనులను పూర్తి చేయించి, అన్ని కాలనీలకు తాగునీటిని సరఫరా చేశారు. ఇంకా ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరించాలని భావించి, క్షేత్రస్థాయి పరిశీలనకు డీఈ, కాంట్రాక్టర్, సిబ్బంది శనివారం ఉదయం 5 గంటలకు వెళ్లారు. ఆ సమయంలో కొండ కింద వీధిలో కొందరు ఇళ్ల వద్ద కొళాయిలను కట్టేయకుండా వదిలేయడం, ఇళ్లపై ట్యాంకులు నిండినా మోటార్లను ఆఫ్ చేయకపోవడం వంటివి వారికి కనిపించాయి. దీంతో ఆవేదన చెందిన కాంట్రాక్టర్, ఇంటి ముందు కొళాయిని అలాగే వదిలేసిన ఓ మహిళ కాళ్లకు దండం పెట్టారు. 'నీటిని వృథా చేయొద్దు అక్కా' అని విన్నవించారు. ఈ వ్యవహారం కాలనీలో చర్చనీయాంశం అయింది. ఇన్నాళ్లూ నీరు లేక ఇబ్బంది పడ్డామని, సమస్యను పరిష్కారమయ్యాక నీటిని వృథా చేయడం తమతప్పేనని పలువురు వ్యాఖ్యానించారు. ఇకపై నీటి వృథా జరగకుండా చూసుకుంటామని కాంట్రాక్టర్‌కు, అధికారులకు హామీ ఇచ్చారు.

- ఆంధ్రజ్యోతి, యాడికి

మాస్క్ మ్యాన్..!



ఉరవకొండ మండల సర్వసభ్య సమావేశంలో వైసీపీ ఎంపీటీసీ వన్నూరు సాబ్ కుక్క మాస్కు ధరించి నిరసన తెలిపాడు. పంచాయతీ పరిధిలో కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పట్టుకుని దూర ప్రాంతాలలో వదివేయాలని ప్లకార్డు ప్రదర్శించాడు. అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశాడు. ఎంపీపీ నరసింహులు(వైసీపీ) అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది.

- ఆంధ్రజ్యోతి, ఉరవకొండ

కేఎస్ఎన్‌లో ఎలుకలు పడ్డాయ్..!



ఆర్ఐఓ, డీఈఈ, అధికారుల హాస్టల్ పరిశీలన

ఎలుకలు పట్టేందుకు ప్రణాళికలు

11 మంది విద్యార్థినులకు వ్యాక్సినేషన్



విద్యార్థులను ఎలుకలు కొరికింది ఈ గదిలోనే

కొరికితే కానీ స్పందించరా..? కళాశాలలో జిల్లా యంత్రాంగం హడావుడి

హాస్టల్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త



అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎలుకలు కొరికితేగాని జిల్లా యంత్రాంగం తేరుకునే పరిస్థితిలేదు. కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల కళాశాలలో చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం. నాలుగు రోజుల క్రితం హాస్టల్లోని 11 మంది విద్యార్థినులను ఎలుకలు కొరకడంతో కళాశాల లెక్చరర్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లి వ్యాక్సినేషన్ వేయించారు. విషయం తెలియడంతో జిల్లా యంత్రాంగం శనివారం కళాశాలకు అధికారులను పంపించి హడావుడి చేసింది. ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ ఇతర శాఖల అధికారులు కళాశాలకు చేరుకుని పరిశీలించారు. హాస్టల్లోని గదులు, బాత్‌రూమ్‌లు, పరిసరాలను కలియతిరిగారు. ఎలుకలు పట్టేందుకు పెస్ట్ కంట్రోల్, శానిటేషన్ తదిర విభాగాలకు చెందిన సిబ్బందిని పిలిపించారు. ర్యాట్ బోన్‌లు, ప్యాడ్‌లు తెప్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ సత్యకు సూచించారు. చిన్నపాటి హాస్టల్ భవనాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు వసతి పొందుతున్నారు. డైనింగ్ హాల్ నుంచి బాత్‌రూమ్ వరకు వ్యర్థపదార్థాలు, పడేసిన వస్తులు పేరుకుపోయాయి. పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో అపరిశుభ్రత నెలకొని ఎలుకలు ప్రవేశిస్తున్నాయి.



హాస్టల్ భవనం పైనుంచి ఇరువైపులా పరిశీలిస్తున్న ఆర్ఐఓ, ప్రిన్సిపాల్



హాస్టల్ ఆవరణలోని చెత్తను తొలగిస్తున్న నగరపాలక సంస్థ కార్మికులు

చెత్తకు కేంద్రం..

ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ, ఆర్టీఏ కార్యాలయం, ప్రైవేట్ అపార్టుమెంట్ మధ్యనున్న కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల కళాశాలలో అపరిశుభ్రత నెలకొంది. ఒకవైపు ఆసుపత్రి, మరోవైపు అపార్ట్‌మెంట్, ఆర్టీఏ కార్యాలయం నుంచి చెత్తాచెదారాన్ని కళాశాల ఆవరణంలోకి పడేస్తున్నారు. కళాశాల యాజమాన్యం పర్యవేక్షణ వదిలేసింది. వెరసి కళాశాల, హాస్టల్ పరిసరాలు చెత్తాచెదారాం, పిచ్చిమొక్కలతో నిండిపోయి ఎలుకలు, పాములకు స్థావరాలుగా మారిపోయాయి. హాస్టల్ భవనం చుట్టూ ఎలుకలు బొరియలు తవ్వాయి. రాత్రి వేళ బాత్‌రూమ్‌లు, గదుల్లోకి దూరి విద్యార్థులను కొరుకుతున్నాయి.

వరుసగా రెండు రోజులు...

హాస్టల్లో వసతి పొందుతున్న విద్యార్థినులను బుధ, గురువారాల్లో ఎలుకలు కొరికాయి. తెలువారుజామున నిద్రలేచే సమయం ముందు ఒకరోజు ఏడుగురిని, మరోరోజు నలుగురు విద్యార్థినులకు కొరికాయి. ఏమౌతుందిలే అని వారు మౌనంగా ఉండిపోయారు. జంతుశాస్త్ర విభాగం లెక్చరర్‌కు విషయం తెలియడంతో అవగాహన కల్పించి వ్యాక్సినేషన్ చేయించారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో జిల్లా యంత్రాంగం తన విధిని విస్మరించింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటై ఏడాదికావస్తున్నా అధికార యంత్రాంగం నిద్రమత్తు వీడలేదు. హాస్టల్ భవనాల సమస్యలు తీర్చాలని కలెక్టర్ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వరకు పలుమార్లు విన్నవించామని కళాశాల యాజమాన్యం వాపోతోంది.


నిర్మాణదశలోనే భవనాలు

కేఎస్ఎన్ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ కష్టాలను తీర్చేలా రెండు అదనపు భవనాల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఐదేళ్లలో హాస్టల్ భవనాల నిర్మాణ పనుల అడుగులు ముందుకు పడలేదు. వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారుల కళాశాల యాజమాన్యం కాళ్లరిగేలా తిరిగినా స్పందించిన పాపానపోలేదు. ఆగిపోయిన భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

గదికి 20 మంది విద్యార్థినులు

కళాశాలలో 1500 మందికి పైగా విద్యార్థినులు డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్నారు. వీరిలో అత్యధికంగా ఉమ్మడి జిల్లాలోని నలుమూల నుంచి వచ్చిన వారే. చదుకోవాలంటే హాస్టల్‌లో ఉండాల్సి రావడం తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కాలేజ్ క్యాంపస్‌లోని చిన్నపాటి రెండు భవనాల్లోని 370 మంది విద్యార్థులు వసతి పొంతున్నారు. ఒక్కో గదిలో 15నుంచి 20 మంది విద్యార్థులు ఉంటున్నారు. రెండు రూములకు కామన్‌గా నాలుగు బాత్‌రూములు మాత్రమే ఏర్పాటుచేశారు. దీంతో అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

ప్రేమ దొంగ..!





అనంతపురం పాతూరుకు చెందిన బాబ్జాన్, నగరంలోని ఓ కాలనీకి చెందిన అమ్మాయి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ అమ్మాయి కుటుంబానికి నచ్చలేదు. దొరికితే చితకబాదాలన్న కసిలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రేమ జంట నగర శివారులోని నేషనల్ పార్కులో శుక్రవారం కలుసుకుంది. విషయం తెలుసుకున్న అమ్మాయి తరపురవారు పార్కు వద్దకు చేరుకున్నారు. కొందరు లోపలికి వెళ్లగా.. మరికొందరు బయట కాపు కాశారు. రాబోయే ఉపద్రవాన్ని పసిగట్టిన బాబ్జాన్.. పార్కు నుంచి పరుగు లంఖించుకున్నాడు. అతన్ని ఎలాగైనా పట్టుకోవాలని భావించిన అమ్మాయి తరపువారు.. 'దొంగ.. దొంగ..' అని అరిచారు. అంతటితో ఆగకుండా డయల్ 100కు ఫోన్ చేసి, పార్కులో చైన్ స్నాచింగ్ జరిగిందని, దొంగ పారిపోతున్నాడని చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నానా తంటాలుపడి బాబ్జాన్‌ను పట్టుకున్నారు. తెంచుకువెళ్లిన బంగారు చైన్ ఎక్కడ అని నిలదీశారు. 'సార్.. నేను దోచుకుంది చైన్ కాదు.. మనసు..' అని పోలీసుల ఎదుట బాబ్జాన్ బావురుమన్నాడు. దొరికితే చితక్కొడతారని భయపడి పారిపోయాను అని జరిగిన విషయం తెలియజేశాడు. కావాలంటే చూడండి అని తన సెల్‌ఫోన్‌ను వారిచేతికిచ్చాడు. అందులో ప్రేమ జంట ఫొటోలు చూసిన పోలీసులు, చైన్ స్నాచింగ్ జరగలేదని నిర్ధారించుకుని, ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

ఇంకానా..!

టిడ్కో గృహాల కోసం తప్పని ఎదురుచూపులు



6





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అరుణాచల పురోహితులు, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అరుణాచలేశ్వరా.. పాహిమాం


- కన్నుల పండువగా స్వామివారి అనుష్టానం
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ అంబికా


అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అరుణాచలేశ్వరుడి అనుష్టానం కార్యక్రమం కన్నులపండువగా సాగింది. అరుణాచల ఆలయం నుంచి తీసుకువచ్చిన ఉత్సవమూర్తులకు అక్కడి ఆలయ పురోహితులచే పూజలు చేయించారు. ఉదయం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజలు నిర్వహించారు. అనంతరం అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. తర్వాత వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామివారికి జ్యోతిపూజ నిర్వహించి 108 రకాల హారతులు సమర్పించారు. ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ పూజా కార్యక్రమాల్లో అనంతపురం నగరంతోపాటు సమీప ప్రాంతాలనుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్నా రు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సినీ నిర్మాత శ్రీధర్ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణ నాయక్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ గట్టు ఎంత భద్రమో..?

- సమ్మర్ స్టోరేజీ ట్యాంకుపై పగుళ్లు
- మరమ్మతు చేయించని గత ప్రభుత్వం

ఉరవకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల సమీపంలో గల సమ్మర్ స్టోరేజీ ట్యాంకు గట్టు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సత్యసాయి తాగునీటి పథకం కింద 1997లో ఈ ట్యాంకును నిర్మించారు. దీని ద్వారా మండలంలోని 14గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకు గట్టు మొత్తం పగుళ్లు ఏర్పడి బలహీన పడ్డాయి. గట్టు పైభాగంలో మట్టి కట్ట మొత్తం నెర్రెలు చీలి కుంగిపోయింది. దీంతో ఎప్పుడు తెగిపోతుందో అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో గట్టుకు అడ్డంగా వేసిన బండలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో గట్టు భద్రత ప్రశ్నార్థకమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.6కోట్లను సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాలేదు. అధికారులు స్పందించి గట్ల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సత్యసాయి తాగునీటిపథకం ఏఈ భార్గవ్‌ను వివరణ కోరగా గట్లపై నెర్రెలు చీలిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.





చెరువు గట్టుపై ఏర్పడిన నెర్రెలు

పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



పురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐలు

సాయంత్రం ప్రశాంతినిలయంలోని శాంతిభవన్, పడమటిగేట్, యాత్రికుల నివాసాలు, షాపింగ్ సెంటర్, సాయికుల్వంత్ సభా మండపం, గణేష్‌గేట్, ప్రశాంతినిలయంలోని ముఖ్యమైన ప్రదేశాల పరిసరాలలో భద్రతాపరమైన ఏర్పాట్లను పరివేక్షించారు. ప్రశాంతి నిలయంలోని పలుప్రదేశాలను డాగ్‌స్క్వాడ్, బీబీ టీంలు తనిఖీలు నిర్వహించాయి. ఎస్పీ రత్న మాట్లాడుతూ దేశ, విదేశ పౌరుల భద్రతా పరమైన చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని హోటళుల, లాడ్జీలు, మామిళ్ల కుంట కూడలిలోని ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఆయా సబ్‌డివిజన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మామిళ్లకుంట కూడలిలో ఎస్పీ వాహన తనిఖీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు సునీత, సురేష్‌కుమార్, ఎస్పీ ఎస్సై ప్రదీప్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, వలి, ఆర్ఎస్సై ప్రదీప్‌సింగ్, స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బంది, మహిళాపోలీసులు తనీఖీల్లో పాల్గొన్నారు.

పురంలో 11మంది
విదేశీయుల గుర్తింపు

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11మంది విదేశీయులను గుర్తించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పట్టణాన్ని జల్లెడ పట్టారు. గుడ్డం ప్రాంతంలో కార్డెన్ సర్చ్ నిర్వహించగా ఓ పాత నేరస్థుడు పట్టుబడ్డాడు. సాయంత్రం లాడ్జీలు, జన సమ్మర్ధ ప్రాంతాలు, ప్రార్థనా మందిరాల్లో తనిఖీలు చేయగా ఖజకిస్థాన్‌కు చెందిన ఒకరు, కిర్గిస్థాన్ 9, ఉక్రెయిన్‌కు చెందిన ఒకరు హిందూపురంలో ఉన్నట్లు గుర్తించారు. ఈ 11మంది జమాత్ కోసం వచ్చినట్లు ఆధారాలు ఉండటంతో పోలీసులు వదిలేశారు. అదేవిధంగా వాహనాలు తనిఖీ చేసి, రికార్డులేని వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



ప్రశాంతినిలయం
సెక్యూరిటీ వింగ్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



హ్యాండ్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

కదిరిఅర్బన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 54వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభించినట్లు ఆర్గనైజర్ రామాంజనేయులు తెలిపారు. మొదటి రోజు లీగ్ మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై అనంతపురం జట్టు, శ్రీకాకుళలం జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించాయన్నారు. కడపజట్టుపై తూర్పుగోదావరి జట్టు, నంద్యాల జట్టుపై చిత్తూరు, ప్రకాశం జట్టుపై పశ్చిమగోదావరి, నంద్యాల జట్టుపై విజయనగరం, బాపట్ల జట్టుపై కర్నూలు జట్టు గెలుపొందాయన్నారు. ఈపోటీలను డీన్ డీఎస్పీ శివకుమార్, కదిరి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, టీడీపీ సీనియర్‌నాయకుడు బంగారు క్రిష్ణమూర్తి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పీడీ నరసింహచారి, జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, కార్యదర్శి మహేష్ తదితరులున్నారు.

ముస్లిం పథకాలకు
మోక్షం కలిగేనా..?

- వైసీపీ హయాంలో అటకెక్కిన ముస్లింల పథకాలు
- ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు




ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ముస్లిం కోసం ప్రవేశ పెట్టిన పథకాలను వైసీపీ హయాంలో జగన్‌రెడ్డి అటకెక్కించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2014-19 హయాంలో మసీదులలో ఇమాంలకు రూ.10 వేలు, మౌజాన్‌లకు రూ.5వేలు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు వారి అభివృద్ధికి పెద్దపీట వేశారు. జగన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేస్తూ.. ముస్లింలకు ఎన్నో హామీలు గుప్పించారు. ఇస్లామిక్ బ్యాంక్, దుల్హన్ రూ.50వేల నుంచి రూ.లక్ష ఇస్తానని, ఇమామ్‌లకు రూ.10వేలు, మసీదు, ఈద్గాల మరమ్మతులకు రూ.25వేలు, విదేశీవిద్య తదితర హామీలిచ్చారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా ఉన్న వాటిని రద్దు చేశారని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫా రద్దు చేశారని, జీవనోపాధికి 50 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తుంటే వాటిని కూడా నిలిపివేశారని తెలిపారు. ఉర్దూ అకాడమీని అస్తవ్యస్తంగా తయారు చేశారు. కూటమి ఎన్నికల ముందు గత పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చింది. ఈ క్రమంలో దుల్హన్ పథకం, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. అవి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. మిగిలిన పథకాలను తక్షణమే అమలు చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

దుల్హాన్ పథకాన్ని అమలు చేయాలి



తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో ముస్లింలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా పేద ముస్లింలకు దుల్హన్ పథకం ఓ వరం. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా చేసుకోవాలని.. తోఫా ద్వారా సరుకులను అందించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ అందిస్తున్న పథకాలన్నీ రద్దుచేసింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈద్గా, మసీదుల ఊసే పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా గత పథకాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాం. - బాబావలి, ధర్మవరం

కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి



ఐదేళ్ల జగన్ పాలనలో రుణాలే ఇవ్వలేదు. టీడీపీ హయాంలో ముస్లింలకు అందిస్తున్న పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం గత పథకాలన్నీ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి. రంజాన్ తోఫా, విదేశీ విద్య తప్పని సరిగా అందించాలి.

- ఫక్రుద్దీన్, ధర్మవరం

ఇంకానా..!
టిడ్కో గృహాల కోసం తప్పని ఎదురుచూపులు

పట్టణం	మంజూరైన గృహాలు	నిర్మాణం చేపట్టినవి..
తాడిపత్రి	6,529	5,184
ధర్మవరం	8,832	1,440
గుత్తి	39896	
హిందూపురం	2,750	1,200
కదిరి	3,762	1,104
పామిడి	2,599	1,344
పుట్టపర్తి	1,243	432
అనంతపురం	6,117	2,304
గుంతకల్లు	4,719	2,160
రాయదుర్గం	1,791	1,008
మొత్తం	38,740	16.272

ఇళ్లు కేటాయించకనే ఈఎంఐల బెడద
ఆందోళనలో లబ్ధిదారులు
ఇళ్ల పూర్తికి రూ.382 కోట్లతో ప్రతిపాదనలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో గృహాల కోసం లబ్ధిదారులకు నేటికీ ఎదురుచూపులు తప్పలేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు టిడ్కో గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16272 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించింది. చాలావరకు పూర్తి చేసింది కూడా. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లపాటు టిడ్కో గృహాలను గాలికొదిలేసింది. దీంతో అవి అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు ఆవాసాలుగా మారిపోయాయి. గతేడాది కొలువు దీరిన కొత్త ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి గృహప్రవేశాలు కూడా చేపడతామని పేర్కొంది. దీంతో టిడ్కో ఇంజనీర్లు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. తమకు ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకులు నోటీసులు పంపడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం త్వరగా టిడ్కో గృహనిర్మాణాలను త్వరగా పూర్తిచేసి, లబ్ధిదారులకు అందజేయాలని ఆశిస్తున్నారు.



అనంతపురంలో టిడ్కో గృహాలు



అనంతపురంలోని ఏపీ టిడ్కో కార్యాలయం

నిర్వీర్యం చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంత పేదలకు అపార్టుమెంట్ల తరహాలో టిడ్కో గృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. వాటిలో 16,272 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. పనులు చివరి దరకు చేరాయి. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ టిడ్కో ఇళ్లను పూర్తిగా అటకెక్కించింది. దీంతో అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు అవాసాలుగా టిడ్కో గృహాలు మారిపోయాయి. ఐదేళ్లా లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పలేదు. టిడ్కో ఇంజనీర్లు చివరి నిర్మాణదశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గత వైసీపీ పభుత్వంలో పలుమార్లు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు.



పుట్టపర్తిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల సముదాయం

రూ.382.92 కోట్లు అవసరం

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణానికి రూ.382.92 కోట్ల నిధులు అవసరం. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78 కోట్ల నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పూర్తికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్ల నిధుల అవసరం అని ప్రతిపాదనలు అందజేశారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, ఇంజనీర్లు(ఫైల్)



బ్యాంకుల నుంచి నోటీసులు

టిడ్కో ఇళ్లను మూడు కేటగిరీలుగా విభజించారు. 300 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడు రూపాయి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5.04 లక్షల వాటాతో మొత్తంగా యూనిట్ రూ.6.55 లక్షలుగా నిర్ణయించారు. 365 చదరపు అడుగుల ఇంటికి లబ్ధిదారుడి వాటా రూ.3.40 లక్షలు, కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 లక్షలు, బ్యాంకు రుణం రూ.3.15 లక్షలు, మొత్తంగా యూనిట్ రూ.7.55 లక్షలుగా నిర్ణయించారు. 430 చదరపు అడుగుల ఇంటికి కేంద్రం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2.90 లక్షలు, బ్యాంకు లోను రూ.3.65 లక్షలు, లబ్ధిదారుడి వాటా రూ.4.15 లక్షలు కలిపి యూనిట్ ధర రూ.8.55 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

ఈఎంఐ కట్టాలని నోటీసులు వచ్చాయి

2018లో రూ.25వేలు టిడ్కో ఇంటి కోసం కట్టాం. ఇంత వరకు ఇల్లు కేటాయించలేదు. అయినా ఈఎంఐ కట్టాలని బ్యాంకు నుంచి నోటీసులు వచ్చాయి. ఇదే విషయంపై అనేకమార్లు మున్సిపాలిటీ, టిడ్కో అధికారులను కలిసి విన్నవించా. అయినా పట్టించుకోవడం లేదు. ఇల్లే లేకుండా ఈఎంఐ ఎలా చెల్లించాలి? ఐదేళ్లపాటు అందరి చుట్టూ తిరిగినా సమస్య పరిష్కరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో ఇళ్లపై నిర్ణయం తీసుకోవాలి.

- నాగేంద్రప్రసాద్,
టిడ్కో లబ్ధిదారుడు, అనంతపురం

నిధులు రాగానే పనులు చేపడతాం



టిడ్కో గృహ సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగానే టిడ్కో గృహాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

- సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి జిల్లా

వేటగాళ్లు..!

మొద్దుల లోడు కనిపిస్తే చాలు వేటే..
బేరం కుదిరితే సరి.. లేదంటే చుక్కలే
తమ పరిధి కాకున్నా.. సామిల్లుల్లో హల్ చల్
అటవీశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలు



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మొద్దుల లోడు కనిపిస్తే చాలు అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధి దాటి వేటాడుతున్నారు. ఇది విధుల్లో భాగంగానా అంటే ఎంత మాత్రం కాదు. 'బేరం' కుదరగానే వదిలేస్తారు. లోడు తరలించేవారు రూల్స్ మాట్లాడితే మాత్రం వారికి పగలే చుక్కలు చూపిస్తారు. ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమాలకు అడ్డు లేకుండా పోతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ రెండు ఉదాహరణలను పరిశీలిస్తే క్షేత్రస్థాయి సిబ్బంది ఎంతలా బరితెగిస్తున్నారో అర్థం అవుతుంది.



- సొంత భూముల్లో పెంచుకొన్న వేపచెట్లను కోసి ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండగా రెండు వాహనాలను గత గురువారం పట్టుకున్నారు. ఇందులో ఒక వాహనం గార్లదిన్నె మండలం నుంచి, మరో వాహనం ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ వాహనాలను పట్టుకుంది మాత్రం శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్. అది కూడా అనంతపురం నగరంలోని ఓ సామిల్లులో. శింగనమలకు చెందిన బీట్ ఆఫీసర్‌కు అనంతపురం సామిల్లులో ఉన్న వాహనాలను పట్టుకొనే అధికారం ఎవరిచ్చారన్నదే ఇక్కడ ప్రశ్న. గార్లదిన్నె మండలం నుంచి వచ్చిన మొద్దులకు సంబంధించిన యజమానులు రూ.10 వేలు ముట్టచెప్పడంతో ఎలాంటి రసీదు లేకుండానే చేతి ఖర్చుల కింద పెట్టుకొని వదిలేసినట్లు తెలిసింది. సొంత పొలాల్లో పెంచుకున్న చెట్లు కొట్టుకోవడానికి రూ.500 చెల్లించి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. అలా చేయకపోవడమే అవినీతి అధికారులకు కలిసి వస్తోంది.
- ఉరవకొండ మండలం వైపు నుంచి వచ్చిన వాహనంలో మొద్దులు ఎక్కువ ఉండటంతో మామూళ్లు కూడా ఎక్కువ ఆశించినట్లు సమా చారం. యజమానులు రూ.ఐదు వేలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే తిరస్కరించినట్లు తెలిసింది. వాహన డ్రైవర్ మాత్రం తనకెందుకు తలనొప్పి అని యజమాని చెప్పిన గుత్తిరోడ్డులోని ఓ సామిల్లులో మొద్దులు వదిలేసి వెళ్లిపోయాడు. ఇక చేసేది ఏమి లేక క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులతో చర్చించారు. టన్ను రూ.17 వేల ప్రకారం నాలుగు టన్నులకు అపరాధ రుసుం చెల్లించాలని హుకుం జారీ చేశారు. అయితే అక్కడ ఉన్న మొద్దులు అంత విలువ చేయవు. చూసి తగిన న్యాయం చేయాలని వెడుకున్నట్లు తెలిసింది. అయితే అప్పటికే క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఉన్నతాధికారి మొద్దుల యజమానులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. అధికారి తీరుకు నిరసనగా మొద్దుల యజమాని తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపి, ఇక్కడ జరుగుతున్న అక్రమాలను శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చాడు. సదరు బీట్ ఆఫీసర్‌గాని, సంబంధిత అధికారి గాని అందుబాటులో లేరు. అయితే ఇక్కడ చోటు చేసుకున్న తంతు వారిద్దరి దృష్టికి వెళ్లింది. దీంతో ఈ సమస్య తమకు ముప్పుగా మారే అవకాశం ఉందని గ్రహించి, ఒక టన్నుకు మాత్రమే ప్రకారం అపరాధ రుసుం కట్టించుకుని వదిలేశారు. అయితే 4 టన్నులకు కట్టించాలని అనుకున్న అధికారులు ఒక టన్నుకే ఎందుకు కట్టించారన్నదే ఇక్కడ ప్రశ్న. డీఎఫ్ఓ విఘ్నేష్, సీఎఫ్ యశోదబాయి స్పందించి క్షేత్రస్థాయి సిబ్బంది ఆగడాలు అరికట్టాల్సి ఉంది.



అటవీశాఖ జిల్లా కార్యాలయం (ఫైల్)

ఎడారి నివారణకు ప్రణాళికలు రూపొందించండి

డ్వామా రాష్ట్ర బృందానికి ప్రభుత్వ విప్ కాలవ సూచన
బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో రాష్ట్ర బృందం పర్యటన

అనంతపురం/క్లాక్‌టవర్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నియోజకవర్గంలో ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందానికి సూచించారు. ఈ మేరకు శనివారం డ్వామా కార్యాలయంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు రాష్ట్ర బృందానికి పలు సూచనలు చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఏడాదికేడాది ఇసుక దిబ్బలు విస్తరిస్తున్న నేపథ్యంలో నివారణచర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేమకల్లు పర్యటనకు వచ్చిన సందర్భంలో ఈ సమస్యను ఆయన దృష్టికి తెచ్చామన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. దీంతో ప్రభుత్వం ఓ ప్రత్యేక పరిశీలన బృందాన్ని రాజస్థాన్‌కు పంపి అధ్యయనం చేయించిందన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎడారి నివారణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆయన ఆ బృందం సభ్యులను కోరారు. డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల పరిధిలోని నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, డి. హోన్నూరు ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను పరిశీలించడంతో పాటు అక్కడి పరిస్థితులను కాలవకు వివరించారు. స్థానికంగా ఎడారి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చించారు. గోరింటాకు, హెన్నా, పాకుడు తీగల జాతికి సంబంధించిన మొక్కలు పెంచడం ద్వారానే ఎడారి నివారణకు పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాన్ని పరిశీలకుల బృందం కాలవకు వివరించింది. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మొక్కల పెంపకం చేపడుతామని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముక్‌కుమార్ పేర్కొన్నారు. పూర్తిగా ప్రభుత్వం మొక్కల పెంపకం ఖర్చు భరిస్తుందన్నారు. జిల్లాలో ఎడారీకరణ నివారణే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సమావేశంలో ఉపాధిహామీ పథకం అడిషనల్ కమిషనర్ ఎం. శివప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ ముఖ్య అధికారి ఎం. గోపీచంద్, డ్వామా పీడీ సలీం బాషా, వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్వామా రాష్ట్ర పరిశీలకుల బృందం, అధికారులతో మాట్లాడుతున్న కాలవ

పకడ్బందీగా పాలిసెట్ నిర్వహించాలి : డీఆర్వో



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో విజయసారథి

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను డీఆర్వో విజయసారథి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాలిసెట్ నిర్వహణకు సంబంధించి అధికారులతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 53,326 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షల సమయంలో గట్టిపోలీసు బందోబస్తుతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ బాబు, హిందూపురం, కదిరి, ప్రిన్సిపాళ్లు హరీష్, రమా, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఫిరోజాబేగం, ఆర్టీసీ డీఎం ఇనయతుల్లా, ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను కలిసిన జిల్లా న్యాయాధికారి



హైకోర్టు జడ్జిలను కలిసిన న్యాయాధికారి, ఎస్పీలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా న్యాయాధికారి భీమారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఉన్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ హరిహరనాథశర్మను ఆయన కలిశారు. ఉమ్మడి జిల్లాల ఎస్పీలు జగదీష్, రత్న కూడా హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు.

డీఎల్ఎస్ఏ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవ అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శిగా న్యాయాధికారి రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇదివవరకు డీఎల్ఎస్ఏ కార్యదర్శిగా ఉన్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అనంతపురం అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో విజయవాడలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న న్యాయాధికారి రాజశేఖర్‌ను నియమించారు.

ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా కేబీ నాగార్జునరెడ్డి



ధర్మవరం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కేబీ నాగార్జునరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ ఎంపిక స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, కార్యదర్శి నరసయ్య సమక్షంలో జరిగింది. నూతనంగా ఎంపికైన కేబీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ...ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా అన్నారు.

ఇంటర్ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు చిన్మయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ వెంకట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో మంచి మార్కులు సాధిస్తే వారికి ఇంటర్‌లో ఉచిత విద్య అందిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు వచ్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షలు మే1 నుంచి 3వరకు పట్టణంలోని స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటల నుంచి 4గంటల మధ్యలో పరీక్షకు హాజరు కావాలన్నారు. పరీక్షకు వచ్చేటప్పుడు ఆధార్, పదోతరగతి మార్కుల జాబితా తీసుకురావాలన్నారు. వివరాలకు 7013721155ను సంప్రదించాలన్నారు.

రాయదుర్గం మీదుగా సమ్మర్ స్పెషల్ రైలు

రాయదుర్గం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ నుంచి రాయదుర్గం మీదుగా బీజాపూర్ వరకు 06561 నెంబర్‌తో సమ్మర్‌స్పెషల్ రైలును నడుపుతున్నట్లు అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బీఎల్ శివకుమార్ తెలిపారు. యశ్వంత్‌పూర్‌లో 30వ తేదీ రాత్రి 10 గంటలకు బయలుదేరి రాయదుర్గంకు తెల్లవారుజామున 4.48 గంటలకు చేరుతుంది. ఇక్కడి నుంచి 4.50కు బయలుదేరి బీజాపూర్‌కు 2.05 గంటలకు చేరుకుంటుంది. మే 1వ తేదీన బీజాపూర్‌లో 06562 నెంబర్ గల రైలు ఉదయం 11.15 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 2.25 గంటలకు రాయదుర్గంకు చేరుకుని యశ్వంత్‌పూర్‌కు రాత్రి 7 గంటలకు చేరుకుంటుంది. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు తెలిపారు.

ముగిసిన మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

884 మంది ఉపాధ్యాయులకు అర్హత పత్రాల జారీ



మెడికల్ సర్టిఫికెట్లకు హాజరైన టీచర్లు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. బదిలీల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 24వతేదీ నుంచి 26వరకు మూడురోజులు పాటు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. విద్యాశాఖ, వైద్యశాఖలు సంయుక్తంగా ఈ పరిశీలన ప్రక్రియ కొనసాగించాయి. వ్యాధులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనకు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓలు ప్రత్యేకంగా ఐదుకౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాల హెచ్ఓడీల సమక్షంలో డాక్టర్లు ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అర్హత ఉన్నవారికే మాత్రమే మెడికల్ సర్టిఫికెట్లు జారీచేశారు. దాదాపు 1700 మందికి పైగా టీచర్లు పరిశీలనకు హాజరయ్యారు. పరిశీలనలో అర్హత పొందిన 884 మందికి మాత్రమే సర్టిఫికెట్లు జారీచేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మూడురోజులుగా ఓ వైపు టీచర్లు మరోవైపు పింఛన్ల లబ్ధిదారుల సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌తో జిల్లా ఆసుపత్రి కిటకిటలాడింది.



ప్రథమ బహుమతి బైక్ అందుకుంటున్న టి. స్వప్న



ద్వితీయ బహుమతి రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న మహబూబ్‌పీరా



తృతీయ బహుమతి టీవీ అందుకుంటున్న మహాలక్ష్మి

ఆంధ్రజ్యోతి ప్రజల పక్షం

కార్ అండ్ బైక్ రేస్ విజేతలు బహుమతులను అందుకున్న పాఠకులు

అనంతపురం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రజల పక్షంగా నిలుస్తోందని కార్ అండ్ బైక్ విజేతలు అన్నారు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. ఉమ్మడి జిల్లా, కర్ణాటక పాఠకులు పంపిన 12వేలకుపైగా కూపన్ల నుంచి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, అనంతలక్ష్మి విద్యాసంస్థల ఛైర్మన్ అనంతరాముడు లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రథమ బహుమతిగా కదిరికి చెందిన టి. స్వప్నకు బైక్‌ను, రెండో బహుమతిగా కణేకల్లుకు చెందిన పి.మహబూబ్ పీరాకు రెఫ్రిజిరేటర్‌ను, మూడో బహుమతిగా ధర్మవరానికి చెందిన ఆర్.మహాలక్ష్మికి కలర్ టీవీని ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ గోపాల్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జ్ రామకృష్ణుడు, డిప్యూటీ మేనేజర్(ప్రకటనలు), డీసీఎం నారాయణస్వామి నాయక్, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సురేష్‌బాబు తదితరులు అందజేశారు.

ఎంతో సంతోషంగా ఉంది...

ఆంధ్రజ్యోతి పాఠకురాలిగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో ప్రథమ బహుమతి గెలుచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మొదటి నుంచి ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నాం. రాజకీయాలు, ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు చదవించేలా, ఆలోచింపజేసేలా ఉంటాయి.

- టి. స్వప్న, కదిరి

మరువలేని బహుమతి..

సమగ్ర సమాచారాన్ని పాఠకులకు చేరవేసే ఆంధ్రజ్యోతి.. ఇలా ఒక పాఠకుడైన నాకు బహుమతి ఇవ్వడం ఎన్నటికీ మరువలేను. రెండో బహుమతిగా రెఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

- పి.మహబూబ్ పీరా, కణేకల్లు

గర్వపడుతున్నా..

ఆంధ్రజ్యోతి పాఠకురాలినైనందుకు గర్వపడుతున్నాను. వార్తలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపడమే కాకుండా పాఠకులను ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం బహుమతులను ఇవ్వడం సంతోషకరం. వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

- ఆర్.మహాలక్ష్మి, ధర్మవరం

జోధ్‌పూర్ తరహాలో మొక్కల పెంపకం

ఇసుక దిబ్బలను పరిశీలించిన రాష్ట్ర డైరెక్టర్
ఈ ఏడాది నుంచే పండ్ల మొక్కలు పెంపకానికి శ్రీకారం



దర్గాహొన్నూరు ఇసుక దిబ్బల్లో పర్యటిస్తున్న రాష్ట్ర కమిటీ

బొమ్మనహాళ్/కణేకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జోధ్‌పూర్ ప్రాంతంలో మాదిరిగా బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తామని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వైవీకే షణ్ముఖ కుమార్ అన్నారు. దర్గాహొన్నూరు, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ప్రాంతంలో రాష్ట్ర కమిటీ పర్యటించి ఈ ప్రాంత పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇసుక దిబ్బల్లో పర్యటిస్తూ కొందరు రైతులు సాగు చేసిన పండ్ల మొక్కలను పరిశీలించారు. వాటి పెంపకంపై రైతులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ఇసుక దిబ్బలు ఏ పంటల సాగుకు అనుకూలమైనవో పరిశీలన చేసి త్వరలో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ఇసుక దిబ్బల వల్ల ఈ ప్రాంతానికి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. దిబ్బల్లో తక్కువ నీటి సామర్థ్యంతో పండ్ల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐదెకరాలోపు ఉన్న వారికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు అదజేస్తామని తెలిపారు. ఎక్కువ భూములు ఉన్న రైతులు వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ ప్రాంతంలో సపోట, నేరేడు, రేగడి పండ్లు పెంచేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపిచంద్, అనంతపురం డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, ఏఓ సాయికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ సుధాకర్, టీఏ సోమన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఉచితంగా ఇవ్వాలి



ఇసుక దిబ్బల్లో ఐదెకరాలు పైబడిన రైతులు అధికంగానే ఉన్నారు. వారికి కూడా పండ్ల మొక్కలు ఉచితంగా ఇవ్వాలి. అలాగే డ్రిప్ సౌకర్యం కల్పించాలి. చెట్లు పెద్దవి అయ్యేవరకు వాటి సంరక్షించేందుకు అధికారులు అన్ని విధాలుగా సహకరించాలి.

- ముక్కన్న, రైతు, దర్గాహొన్నూరు

ఇసుక తరలించాలి



గోవిందవాడ ప్రాంతంలో దిబ్బలు నుంచి ఇసుకను బీడు భూములకు ఉచితంగా తరలించాలి. మాకు 16 ఎకరాలు ఉంది. ముగ్గురు అన్నదమ్ములు ఉన్నాం.

- గురుమూర్తి, రైతు, గోవింద

నగరంలో ఐదిళ్లలో చోరీ

రూ.5వేలు తస్కరించిన దొంగలు... లాకర్లలో పెట్టడంతో బంగారం సేఫ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎవరెవరు ఇళ్లల్లో ఉండరో రెక్కీ నిర్వహించారు. అన్నీ దగ్గర దగ్గరగా ఉన్న ఇళ్లనే ఎంచుకున్నారు. తదుపరి ఐదు ఇళ్లలోకి చోరీకి వెళ్లిన దొంగలకు నిరాశే మిగిలింది. ఇంటికో వెయ్యి చొప్పున రూ.5వేలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అందులో నాలుగు కుటుంబాలు బంగారం బ్యాంకు లాకర్లలో ఉంచడంతో సేఫ్ అయింది. మరో కుటుంబం ఇంట్లోనే రహస్యంగా ఉంచడంతో దొంగలు గుర్తించలేకపోయారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక నగరంలోని గౌరవ్‌గార్డెన్స్‌లో దొంగలు పడ్డారు. అక్కడ పక్క పక్క ఇళ్లలోనే నివాసముంటున్న మణికంఠారెడ్డి, బసవేశ్వరగౌడ్, విజయభాస్కర్, జితేంద్రమౌళి, శివకుమార్ కుటుంబాలు బంధువుల ఇళ్లకు, వేరే ఊర్లకు వెళ్లారు. ఆ ఇళ్లల్లో జరిగిన దొంగతనం శనివారం ఉదయం వెలుగు చూసింది. వీరిలో నాలుగు కుటుంబాల బంగారం లాకర్లలో ఉందని, చిన్న, చిన్న వస్తువులు దొంగతనం జరిగినట్లు పోలీసులకు తెలిపారు. కియ కంపెనీలో పనిచేస్తున్న శివకుమార్ ఇంట్లోని బీరువాలో రూ.5వేలు దొంగిలించుకుపోయారు. అదే ఇంట్లోని 8తులాల బంగారు ఆభరణాలు రహస్యంగా ఉంచడంతో దొంగలకు దొరకలేదు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇద్దరు దొంగలు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

గస్తీ ఏమైంది...?

రాత్రి 1గంట నుంచి తెల్లవారుజాము 4గంటల మధ్యలో ఈ దొంగతనాలు జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు, మూడు గంటలు దొంగలు దర్జాగా ఆ ఇళ్లల్లో విలువైన వస్తువుల కోసం వెతికారు. కానీ పోలీసులు అటువైపు గస్తీ నిర్వహించినా పరారయ్యేవారేమో. పోలీసులు గస్తీ అటకెక్కించారనేందుకు ఈ సంఘటనే ఉదాహరణ అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జేఎన్‌టీయూకు ఉత్తమ ర్యాంకు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో జేఎన్‌టీయూ అనంతపురానికి ఉత్తమ ర్యాంకు దక్కింది. ఆ సంస్థ ఆసియాలో ఉన్న యూనివర్సిటీల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్న వాటికి ర్యాంకులు కేటాయించింది. ఇందులో భాగంగా పనితీరుపై 18 సూచికలను పరిగణనలోకి తీసుకుంది. వాటి ఆధారంగా యూనివర్సిటీలకు ర్యాంకులు కేటాయించింది. ఇందులో 251-300 బ్యాండ్‌లో జేఎన్టీయూ నిలిచి రాష్ట్రంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దీంతో వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య హర్షాన్ని వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

రేపటి నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లోనూ 28వ తేదీ నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ కథలు వినడం, పుస్తకం చదవవడం, చెస్, క్యారమ్స్ ఆడటం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్ వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ ఉంటుందన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మడకశిర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని రాష్ట్ర రవాణా క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఏబీసీడీలు రాని వారికి మంత్రి పదవులు ఇవ్వడంతో ఇరిగేషన్ శాఖతో పాటు పలుశాఖల్లో విధ్వంసం జరిగిందన్నారు. మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఆర్టీసీతో పాటు ఇతర శాఖలు కూడా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నారన్నారు. రాబోయే ఏడాదిన్న కాలంలో రాష్ట్రంలో రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డుపైకి వస్తాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అమరావతి పునఃనిర్మాణ పనులను శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రూ. రెండువేల కోట్లతో కడప, కర్నూలులో ఎస్ఈజడ్ పనులు చేపట్టడం, గోదావరి జలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్రైం/అనంతపురం టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు, పారిశుధ్యం, రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిలైట్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో పారిశుధ్యంపై శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్, మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్, కమిషనర్ బాలస్వామి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో పరిశుభ్రతను టీం వర్క్‌గా నిర్వహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ ఉదయం 6గంటలకు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇసుక నిల్వ ఉంచండి

రాబోయే వర్షాకాలంలో అభివృద్ధి పనులకు సరిపడా ఇసుక నిల్వ ఉంచాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇసుక నిల్వలపై శనివారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాలం నాటికి 70వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉండాలన్నారు. సమావేశంలో మైన్స్‌డీడీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, గ్రౌండ్‌వాటర్ డీడీ తిప్పేస్వామి, ఆర్టీఓ సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్స్‌కు సత్కారం

ప్రభుత్వ బడిలో చదివి పపదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కలెక్టరేట్‌లో శనివారం విద్యాశాఖ పరిధిలో 15మంది, బీసీ వెల్ఫేర్ పరిధిలో 15మంది, ట్రైబల్‌వెల్ఫేర్‌లో ఆరుగురు, కేజీబీవీలలో ఆరుగురు, ఎస్సీ వెల్ఫేర్‌లో ఆరుగురు చొప్పన మొత్తం 48మందిని కలెక్టరు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్ బాబు, సంక్షేమ శాఖల అధికారులు, టాపర్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనంత ఆణిముత్యాలకు ఆర్థిక సాయం

జిల్లాలో పేద ఉత్తమ విద్యార్థుల చదువుల కోసం అమలు చేస్తున్న అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీకి రెవెన్యూ, విద్యుత్‌శాఖలు విరాళం అందించాయి, రెవెన్యూశాఖ ఉద్యోగులు రూ.50వేలు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. భూ సంరక్షణ విభాగం తహసీల్దారు రూ.50వేలు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ రూ.25వేలు విరాళం వ్యక్తిగతంగా కలెక్టర్‌కు అందజేశారు.

వీరాపురాన్ని అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): సైబీరియన్ వలస పక్షులు విడిది చేసే వీరాపురం, వెంకటాపురం గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈ నెల 21న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అతిథుల ఆకలి కేకలు' కథనానికి స్పందించిన కలెక్టర్, శనివారం ఆ రెండు గ్రామాలను సందర్శించారు. మిద్దెలపైకి ఎక్కి చెట్లపై ఉన్న వలస పక్షులను వీక్షించారు. పక్షుల సంరక్షణ గురించి గ్రామస్థులతో మాట్లాడారు. ఏటా జనవరిలో వచ్చి ఆగస్టు వరకు ఉండి, సంతతిని వృద్ధి చేసుకుని తిరిగి వెళుతుంటాయని గ్రామస్థులు ఆయనకు వివరించారు. అయితే కరువు పరిస్థితులు ఉన్నప్పుడు పక్షులు రావని, వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగట్టి రాకుండా ఉండిపోతాయని వివరించారు. పక్షులు గ్రామానికి రాకపోతే కరువు వస్తుందని తమకు అర్థమవుతుందని అన్నారు. పక్షులకు వేసవిలో ఆహారం, నీటి సమస్య ఉంటోందని, పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, పెనుకొండ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వెంకటేశులు, సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి ఉన్నారు.



వీరాపురంలో బైనాక్యులర్‌తో పక్షులను వీక్షిస్తున్న కలెక్టర్

న్యూస్ బాక్స్

అక్కల్‌కోట మహారాజ్ ఆరాధనోత్సవం


పూజలందుకున్న అక్కల్‌కోట మహారాజ్ స్వామి, కొల్హాపూర్ మహాలక్ష్మి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో శనివారం స్వామి సమర్థ అక్కల్‌కోట మహరాజ్ 147వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని అక్కల్‌కోట మహరాజ్ స్వామితోపాటు కొల్హాపూర్ మహాలక్ష్మి, ఇతర దేవతామూర్తులకు వేద పండితుడు సుంకేసుల సత్యనారాయణరావు నేతృత్వంలో విశేష పూజలు చేశారు. భక్తులు సామూహిక భజనలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన వినియోగం చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు టీసీ జయచంద్రారెడ్డి, దేవనూరు సుందరం విజయ్‌కుమార్, చంద్రశేఖర్ బాబు, కొండారెడ్డి, నాగప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శారదా నగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో పూజాకార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతేశ్వరస్వామికి భక్తుల చేతులమీదుగా పంచామృత సహిత నవధాన్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

రిటైర్మెంట్ వయో పరిమితి పెంచాలి

● గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్‌కు వినతి

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ గ్రంథాలయ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని గ్రామీణ గ్రంథాలయాధికారుల యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెన్నకేశవులు కోరారు. గుంటూరులోని కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు, ఏపీ రాష్ట్ర పౌరగ్రంథాలయ సంచాలకులు క్రిష్ణమోహన్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్టు చెన్నకేశవులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా పదవీవిరమణ వయస్సు పెంపుతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 10లక్షలు, కనీస పెన్షన్ రూ. 10వేలుకు పెంచాలనే పలు డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు సహకారంతో ఓం సంగీత నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమనాథ్ నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ భవన్‌లో ఈనెల 30వ తేదీ నుంచి 40 రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంగీతం, నృత్యం, కోలాటాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 8790601221 నంబర్‌ను సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మద్యపానం వల్ల అనర్థాలపై అవగాహన

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అనంతపురం రూరల్ మండలం కక్కులపల్లి సమీపంలోని భవిష్యత్ ఎంటర్‌ప్రైజెస్ వద్ద కార్మికులకు మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐలు సత్యనారా యణ, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐ జయనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపచెర్ల గ్రామంలో శనివారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ సిబ్బందితో దాడు చేసి నాటుసారా నిర్వాహకులును అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఎస్ఐ జయసింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు విటులు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో... లాడ్జిలలో రికార్డులు పరిశీలించారు. అనుమానితులొస్తే సమాచారం అందించాలన్నారు. నగరంలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తుండగా ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నప్పేట గ్రామ సరిహద్దుల్లో ఓ గుర్తుతెలియని యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. హంద్రీనీవా కాలువ పక్కన జక్కొండ వద్ద చిన్నప్పేటకు చెందిన ఓ రైతు పొలంలో గుర్తుతెలియని యువకుడి శవం రాళ్ల మధ్యలో పడిఉంది. సుమారు 25 నుంచి 30 వయస్సు మధ్య ఉంటుందనిపోలీసులు తెలిపారు. రెడ్‌కలర్ టీషర్టు, బ్లూకలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. కాలువ పనులు చేస్తున్నవారు దుర్వాసన వస్తుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. దాదాపు వారం క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడవేసి వెళ్లారా లేక ఆత్మహత్య అనేది పోలీసుల దర్యాప్తులో తెలాల్సింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నాగేంద్ర మృతి బాధాకరం

● యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర బాబు శుక్రవారం రాత్రి మృతి చెందడం బాధాకరమని ఆ సంఘం నాయకులు జయచంద్రా రెడ్డి, కోటేశ్వర్, లింగమయ్య, గోవిందరాజులు, సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో ఎంతో కీలకంగా పనిచేశారన్నారు. ఆయన భౌతికంగా దూరం కావడం యూటీఎఫ్‌కు తీరనిలోటన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైల బోయలపల్లికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరెడ్డి(55) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని, పరిస్థితి విషమించి స్వగృహంలో మృతిచెందాడని టీడీపీ స్థానిక నాయకులు తెలిపారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మమ్మ, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ పరిదిలోని పలువురు టీడీపీ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు


పాతూరు గాంధీ విగ్రహం వద్ద ఆర్యవైశ్యుల నిరసన

ఉగ్రదాడిపై నిరసన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం నశించాలి... హిందూ ముస్లిం బాయి.. బాయి అంటూ.... పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మాజీసైనికులు శనివారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని అణిచివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవసరమైతే దేశం కోసం తామంతా ప్రాణాలర్పించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ర్యాలీలో సంఘం సభ్యులు పట్నం ఉమామహేశ్వర రావు, రవికుమార్, మహమ్మద్ గౌస్, హుస్సేన్, పెంచలయ్య, ఈశ్వరయ్య రంగారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్ : దేశంలోని 140 కోట్లమంది పౌరులు ఒక్కసారి బిగించే పిడికిలికి పాకిస్తాన్ సాటి కాదని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు సంతాపంగా ముస్లిం మైనార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం పాతూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హాఫీస్ అన్వర్, కరీముల్లా, ఖాజా, అమీర్‌బాషా, ఫిరోజ్, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు. అలాగే పాతూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాతూరు వాసవీ కన్యాక పరమేశ్వరి ఆలయం నుంచి మార్కెట్ సర్కిల్‌లోని గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్‌కుమార్, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధూపకుంట్ల శబరివరప్రసాద్, గర్లాల నాగరాజు, ధూపకుంట్ల సాయినాథ్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



పాతూరులో ముస్లిం మైనార్టీలు, ప్రజాసంఘాల నిరసన ర్యాలీ

ఉగ్రవాదులు మానవత్వానికి శత్రువులు : మేయర్


పోస్టర్లు ప్రదర్శిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులు మానవత్వానికి శతువ్రులని నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం మేయర్ తన కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పహల్గాంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దురాగతానికి పాల్పడిన వారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టకూడదన్నారు. కార్పొరేటర్లల రహంతుల్లా, ఇషాక్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్, చింతకుంట మధు, కుళ్లాయిస్వామి, కాకర్ల శీనా పాల్గొన్నారు.

భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఆమె శనివారం స్థానిక అనంతపురం భూసార పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. మే 25వ తేదీ లోగా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టినమూనాలను సేకరించి, భూసార పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. అనంతరం ఎస్కేయూ విద్యార్థులకు భూసార పరీక్షలు నిర్వహించే పద్ధతులపై అగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ రోజా పుష్పలత, ఏఓలు శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రతాప్, ఉమామహేశ్వరి, అర్చన, ఏఈఓ గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రపరిచిని ఈవీఎంలను కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని పాత ఆర్డీఓ ఆఫీస్ సమీపంలో ఉన్న గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. ఎన్నికల కమిషన్ నిబంధనలమేరకు శనివారం కలెక్టర్ ఇతర అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో వెళ్లి తలుపుల సీజ్ తీయించారు. లోపలికి వెళ్లి ఈవీఎంల భద్రతను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కలెక్టరేట్‌సెక్షన్ ఆఫీసర్ యుగేశ్వరి,డీటీ కనకరాజు, పార్టీల ప్రతినిధులు సాల్గొన్నారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వద్దు

● ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో నూరు శాతం విదేశీ పెట్టుబడులు వద్దని, ఎల్ఐసీ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో శనివారం ఎల్ఐసీ ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ.... ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మే 20న చేపట్టే సమ్మెను బ్యాంకు ఉద్యోగులు, ఇతర కార్మికులతో కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎల్ఐసీ ఉద్యోగుల డివిజన్ ఉపాధ్యక్షుడు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి రఘు నాథరెడ్డి, నాయకులు అక్బర్‌బాషా, శ్రీనివాసులు, నాగరాజు, మధుసూదన్ రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశపరీక్ష

రామగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశపరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ అమీనా బేగం, సూపరింటెండెంట్ రామకృష్ణ తెలిపారు. నసనకోట, పే రూరు గురుకుల పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపికచేశారని, నసనకోట 586 మంది, పేరూరులో 548మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

ప్రశాంతంగా వనభోజనాలు

కనగానపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండంలంలోని కోనాపురం గ్రామంలో వనభోజనాల కార్యక్రమం పోలీసుల ముందస్తు చర్యలతో ప్రశాంతంగా ముగిసింది. ఆనవాయితీగా ప్రకారం శనివారం గ్రామసులంతా ఇళ్లకు తాళాలు వేసి వనవాసం వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో గ్రామ ప్రజలు వనభోజనాల గంప ఎత్తుకోని తోరణాలు కింద నుంచి ఇంటికి వెళ్లారు. అయితే పెద్దమ్మకు టెంకాయ కొట్టే విషయంలో గొడవలు ఉండేవి. దీంతో కనగానపల్లి పోలీసులు ముందస్తుగా భారీగా భందోబస్తు ఏర్పాటు చేసి ఆలయ పూజారితో టెంకాయ కొట్టించారు. దీంతో వివాదం సద్దుమణిగింది

ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఈడిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార అవార్డుల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 450 మార్కులకుపైగా, ప్రైవేటు పాఠశాలలోని 500 మార్కులకుపైగా వచ్చిన ఈడిగ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 800కు పైగా, ప్రైవేటు కళాశాల్లో 900కు పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు అర్హులని తెలిపారు. మే 15లోగా ఫ్లాట్ నెంబర్ 311, అనన్య అపార్టుమెంట్, ప్రియాంక నగర్, అనంతపురం అడ్రస్‌కు మార్కుల మెమో, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్ పంపాలన్నారు. వాట్సాప్ ద్వారా పంపాలనుకుంటే 7989038176, 9985604329, 8790790435 నెంబర్లకు పంపాలన్నారు. అర్హులైన ఈడిగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీచర్ల ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలి

● డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి

అనంతపురం విద్య, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల వల్ల నిలిచిపోయిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు ఇతర నాయకులు శనివారం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేసుల కారణంగా వందలాది ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్లు ఆగిపోయాయన్నారు. అలాగే పలు డిమాండ్లతో కూడిని వినతిపత్రాని డీఈఓకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు సూర్యుడు, చంద్రశేఖర్, ఫణిభూషణ్, సురేష్‌కృష్ణమోహన్, రాజశేఖర్, చలపతి, డేనియల్, మల్లికార్జున, రవి తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 18వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,890 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 12,220తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 849 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆస్పత్రి నుంచి గుజరీ సామగ్రి తరలింపు

అనంతపురం టౌన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజనాస్పత్రిలో పరిసరాల పరిశుభ్రతపై యంత్రాంగం దృష్టిపెట్టింది. కొన్నేళ్లుగా ఆస్పత్రి వెనుకభాగంలోని డైట్ విభాగానికి వెళ్లే ప్రాంతంలో పెద్దఎత్తున వివిధరకాల ఇనుపగుజరీతో పాటు పాడైపోయిన పరుపులు తది తర వాటిని కుప్పలుగా ఉంచుతూ వస్తున్నారు. అక్కడకు వెళితేనే తీవ్రదుర్వాసన వచ్చేది. ఇటీవల కలెక్టరు వినోద్‌కుమార్ ఆస్పత్రిలో తనికీలు చేసినపుడు అక్కడ ఉన్నగుజరీ కుప్పలను చూసి మండిపడ్డారు. దీంతో సూపరింటెండెంట్ ఏపీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు సమావేశమై నిబంధనల మేరకు టెండర్ పిలిచి గుజరీని తరలించేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న గుజరీని మొత్తం తరలించడం ప్రారంభించారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా పాడుబడిన రైల్వే క్వార్టర్స్‌లో శనివారం అనంతపురం కమలా నగర్‌కు చెందిన దేవిరెడ్డి ఆనంద్(54) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్‌సీఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం కమలానగర్‌లో నివాసముంటున్న ఆనంద్ ఫొటో ల్యామినేషన్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసై తరచూ భార్య, కొడుకుతో గొడవపడేవాడన్నారు. దీంతో భార్య రాయదుర్గంలో పుట్టినింటికి వెళ్లిపోయిందన్నారు. రెండు నెలల ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆనంద్ కర్నూలు, గుంతకల్లుతోపాటు తదితర చోట్ల తిరుగుతూ ఉండేవాడన్నారు. శనివారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పాడుబడిన రైల్వే క్వార్టర్స్‌లోని ఇనుప రాడ్‌కు లైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సుజాత, ఒక కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నగరంలో ఆటో డ్రైవర్...

అనంతపురం క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన రాజేష్(23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం శిల్పాలేపాక్షినగర్‌లోని తన స్నేహితుడు గదికి వెళ్లాడు. స్నేహితుడు బయటకెళ్లడంతో సాయంత్రం సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని...బాలుడికి గాయాలు

నగర శివారులోని వనమిత్ర పార్కు సమీపంలో శనివారం హైవేలో అనంతసాగర్ కాలనీకి చెందిన తొమ్మిదేళ్ల నందకిషోర్ రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ హైటెక్ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రమదానం



రామగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నిత్యం రాజకీయాలతో బిజీగా ఉండే ఎమ్మెల్యే పరిటాల సునీత నసనకోట దుర్గమ్మ ఉత్సవాల ఏర్పాట్ల లో పాల్గొని శ్రమదానం చేశారు. నసనకోటలో వెలసిన దుర్గమ్మ ఉత్సవాలను చాలా సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో పంచాయతీ వాసులు స్వచ్ఛందంగా పాల్గొంటూ శ్రమదానం చేస్తున్నారు. వారితో పరిటాల సునీత చేయి కలిపి మండుటెండలోనూ ఇటుకలు, ఇసుక మోసి శ్రమదానంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి గుడి మెట్ల మీదే భోజనం చేశారు. మే 14,15,16 తేదీలలో అమ్మవారి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.ఇది తన ఊరు అని ఇక్కడ పనులలో పాలు పంచుకోవడం తన బాధ్యత అని ఆమె అన్నారు.

శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వాసవీమాతకు లక్షపుష్పార్చన

● హాజరైన వామనాశ్రమ స్వామీజీ


పుష్పార్చన చేస్తున్న స్వామీజీ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం సాయంత్రం లోక కల్యాణం కోసం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైశ్య కుల గురువు పూజ్యశ్రీ వామనాశ్రమ స్వామీజీ హాజరై వాసవీమాతకు పుష్పార్చన చేశారు. అలాగే ఆలయ ఆవరణలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక లలితా సహస్రనామావళితో లక్షపుష్పార్చన చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను స్వామీజీ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, సూర్యప్రకాష్, ఆదిశేషగుప్త, మురళి, రమేష్‌బాబు, సతీష్‌కుమార్, సురేష్‌కుమార్, రఘు, సురేష్, వెంకటేష్, సుకుమార్, మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


లక్షపుష్పార్చనలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

ఆర్డీటీ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సంస్థ ప్రతినిధులకు ప్రభుత్వ విప్ కాలవ హామీ

అనంతపురం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి) : ఆర్డీటీకి విదేశీ విరాళాలు కొనసాగించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆ సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఆర్డీటీ ప్రతినిధులు శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి శనివారం కాల్వ నివాసానికి వెళ్లి ఆయనను కలిసి సమస్యను వివరించారు. విదేశీ విరాళాల రిజిస్ట్రేషన్ లైసెన్సు రెన్యువల్ ఆపివేయడంతో సంస్థకు విదేశీ విరాళాలు ఆగిపోయాయన్నారు. పేదలకోసం పనిచేస్తున్న సంస్థ నిర్వహణకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ... మంత్రి నారా లోకేశ్‌బాబు ఇదివరకే కేంద్రంతో చర్చలు జరిపారన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆర్డీటీకి కేంద్రం మినహాయింపు ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఆర్డీటీకి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్ఏ) రెన్యువల్ విషయంలో కేంద్రం మినహాయింపు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈ నెల 28న జడ్పీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ ఇతర నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఆర్డీటీ పలు జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. 28న ఉదయం 10 గంటలకు జడ్పీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆర్డీటీని కాపాడుకోడానికి మేధావులు, నాయకులు హాజరై పలు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రాజారెడ్డి, ఇతర నాయకులు కేశవరెడ్డి, శ్రీరాములు, రమణయ్య, అల్లిపీరా, రామకృష్ణ, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

80 శాతం లా సీట్లు స్థానికేతరులకేనా..?


● ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిజయనగర కళాశాలలో 80శాతం స్థానికేతరులకు న్యాయ విద్యలో ప్రవేశాలు ఎలా కల్పిస్తారని ఏఐఎస్ఏ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రశ్నించారు. స్థానిక విద్యార్థులకు న్యాయం చేయాలని వారు శనివారం ఎస్కేయూలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వేమన, ప్రసాద్ మాట్లాడుతూ విద్యా ప్రవేశాల్లో స్థానిక కోటాకింద 80శాతం, స్థానికేతరులకు 20శాతం చొప్పున ప్రవేశాలు కల్పించడం ప్రభుత్వ విధానమన్నారు. అయితే గత వైసీపీపాలనలో ఎస్కేయూ, రాష్ట్ర విద్యాశాఖ నిర్లక్ష్యంతో శ్రీవిజయనగర లా కాలేజ్‌లో స్థానిక విద్యార్థులు ప్రవేశాలు కోల్పోయారని వాపోయారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అయినా నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పించి జిల్లాలోని పేద విద్యార్థులకు న్యాయ విద్య అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు కృష్ణ, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ప్రవేశాలు : ప్రిన్సిపాల్

న్యాయ శాస్త్ర విద్య బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశాలు కల్పిస్తున్నామని శ్రీవిజయనగర లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ రాఘవేంద్రాచార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో తమిళనాడుకు చెందిన విద్యార్థులే అధికంగా ఉన్నారనడంలో నిజంలేదన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పదిశాతం మినహా లేరని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల ఆరోపణలు వట్టివేనని ఖండించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో యార్డుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం 11గంటల సమయంలో చీనీకాయల లోడింగ్ కోసం యార్డులోని చీనీ మార్కెట్‌లోకి లారీ వచ్చింది. లారీని రివర్స్ చేసే క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగలు తెగిపడి కిందికి పడిపోయాయి. అయితే స్థానికంగా ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. ప్రమాద ఘటన తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని సంబంధిత లారీ డ్రైవర్‌తో స్తంభం, ఇతరాత్రవాటికి అయ్యే ఖర్చు కట్టించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఉన్నఫలంగా విద్యుత్ స్తంభం విరిగిపోవడం, ఆ సమయంలోనే పశువుల వాహనాలు ఒక్కొక్కటి యార్డులోకి రావడంతో.... యార్డులోని వాహనాలు బయటకు వెళ్లే వీలులేకుండా పోయింది. వాహనాలు క్లియర్ అయ్యేందుకు గంటల సమయం పట్టింది. రైతులు, వ్యాపారులు అసౌకర్యానికి గురయ్యారు. వాహనాలను నియత్రించడంలో యార్డు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

మినీ గోకులం బిల్లులు అందేదెన్నడు?

● షెడ్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా మంజూరు కాని బిల్లులు
● లబోదిబోమంటున్న లబ్ధిదారులు

శెట్టూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మినీగోకులం షెడ్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా... వాటికి సంబంధించిన బిల్లులు ఇంకా మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం మండల వ్యాప్తంగా 53 గోకులం షెడ్లను మంజూరు చేసింది. అందులో 44 షెడ్ల నిర్మాణం పూర్తయింది. వాటికి సంబంధించి సుమారు రూ. 60 లక్షల బిల్లు రావాల్సి ఉంది. అయితే ఆరు నెలలు కావస్తున్నా బిల్లులు అందడం లేదు. దీంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. పాడి పశువుల సంరక్షణ కొరకు ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. అయితే లబ్ధిదారులు ప్రైవేటు వ్యక్తుల వద్ద లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి వాటి


బసంపల్లిలో మినీగోకులం షెడ్డు పరిశీలనలో డ్వామా పీడీ సలీంబాషా (ఫైల్)

నిర్మాణం పూర్తి చేశారు. అధికారులు వచ్చి ప్రారంభోత్సవం కూడా చేసేశారు. కాగా నేటికీ వాటి బిల్లులు మాత్రం ఇవ్వలేదు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో ఖచ్చితంగా చెప్పేవారే కరువయ్యారని మండలంలోని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి షెడ్ల బిల్లులు అందేవిధంగా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

బిల్లు త్వరగా చెల్లించండి ..



ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు చేసి మినీ గోకులం షెడ్డు నిర్మాణం చేపట్టాం. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభు త్వం స్పందించి త్వరగా బిల్లులు అందించాలి.
- వన్నూరురెడ్డి, బసంపల్లి

వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం..



మినీగోకులం షెడ్డు నిర్మించి ఆరు నెలలకు కావస్తున్నా బిల్లులందడం లేదు. దీంతో అప్పు తెచ్చిన చోట వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం త్వరగా బిల్లులు చెల్లించాలి.
- రామాంజనేయులు, బొమ్మపల్లి

త్వరలోనే కోణాపురం చెరువుకు కృష్ణాజలాలు


పంపుహౌస్‌కు చేరుకున్న పైపుల వద్ద గ్రామస్థులు

బెళుగుప్ప, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కోణాపురం, గంగవరం గ్రామాల రై తుల కల ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో సాకారం కానుంది. త్వరలోనే కోణాపురం చెరువుకు కృష్ణాజలాలు రానున్నాయి. ఆ చెరువుకు నీరందించడానికి గతంలో గ్రామ సమీపంలో పంపు హౌస్ నిర్మిస్తే అప్పటి వైసీపీ ప్రభు త్వం విద్యుత్ సౌకర్యం కల్పించడానికి కూడా చర్యలు తీసుకోలేదు. అదే కొత్త ప్రభుత్వం ఏర్పడి పయ్యావుల కేశవ్ మంత్రి అవగానే నీరందించడానికి ఏర్పాట్లను ముమ్మరం చేయించారు. ఇక్కడి నుంచి చెరువుకు నీరు పోవాలంటే 3 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేసి తీసుకెళ్లాలి. అందుకు పైప్ లైన్ ఏర్పాటులో భాగంగా పైపులు శనివారం పంపుహౌస్‌కు చేరుకున్నాయి. వాటిని చూసిన ఆయా గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు తమ కల నెరవేరనుందని హర్షం వ్యక్తం చేశారు. పయ్యావుల సోదరులకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

మోదీని విమర్శించే అర్హత షర్మిలకు లేదు: బీజేపీ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని విమర్శించే అర్హత ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు లేదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఇల్లూరు గోపాలకృష్ణ భవనంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ రక్షణ కోసం నిరంతరం పాటు పడుతున్న మోదీపై షర్మిల వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. షర్మిల నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, న్యూ టౌన్ అధ్యక్షుడు వాసం రవి బాబు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కేశవ, నాయకులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

ఉరవకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పలువురికి సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ అధ్యక్షుడు కిష్టప్ప సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురిని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిష్టప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కౌకుంట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం హమాలీల సమస్యలను పరిష్కరించాలని హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీ.మహేష్ కోరారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 44లక్షల మంది హమాలీలు ఉన్నారని, అయితే ప్రభుత్వాలు వారి సమస్యలను పరిష్కరించలేకపోవడం బాధాకరమని అన్నారు. హమాలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆదివారం ఉదయం స్థానిక బీరప్పగుడి ఫంక్షన్ హాల్లో ఉదయం 10గంటలకు హమాలీల సదస్సును నిర్వహించనున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణుడు హాజరయ్యే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హమాలీలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్టు

తాడిపత్రి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికను మోసం చేసినందుకు గాను రామాంజనేయులుపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తెలిపారు. ఆరునెలలక్రితం కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అనగొండ గ్రామానికి చెందిన రామాంజనేయులు మైనర్‌బాలికతో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం పెంచుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత ఆమెను తనతో పాటు తీసుకెళ్లాడు. నెలరోజులక్రితం తనకు ఇష్టం లేదని తాడిపత్రిలోని ఆమె ఇంటివద్ద విడిచిపెట్టి వెళ్లిపోయాడు. మోసపోయిన బాలిక అప్పట్లో తల్లిదండ్రులతో కలిసి రామాంజనేయులుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు నిందితున్ని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని ఏఎస్పీ తెలిపారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంతలపల్లి గ్రామ సమీపంలో పులివెందుల- అనంతపురం రహదారిపై సీఐ సత్తిబాబు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం ఉన్న వాహనాలను నిలిపి రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇవేమి ఎండలు బాబోయ్..

● యాడికిలో 41డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న యాడికి బస్టాండ్ ప్రాంతం

యాడికి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండలు మండుతున్నాయి. వేసవి తా పం రోజురోజుకు పెరిగిపోతోంది. నిన్న, మొన్నటి వరకు 39డిగ్రీల నమోదైన ఉష్ణోగ్రత శనివారం ఏకంగా 41 డిగ్రీలకు చేరుకుంది. ఎండ వేడిమికి ప్రజలు బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఇవెక్కడి ఎండలు బాబోయ్ అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం మధ్యాహ్న సమయంలో జన సంచారం లేక నిర్మానుష్యంగా మారింది. బయట తిరిగే వారు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ బారిన పడాల్సి వస్తుంది.

శరవేగంగా కల్వర్టు నిర్మాణం

● పనులు పూర్తయితే డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
● ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే అమిలినేని


పాత బస్టాండ్ వద్ద సాగుతున్న కల్వర్టు నిర్మాణం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై కల్వర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఓ వైపు పనులు దాదాపుగా పూర్తిచేశారు. మరో వైపు కూడా పనులు ప్రారంభించారు. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తి అయితే శాశ్వతంగా డ్రైనేజీ సమస్యకు చెక్ పడుతుంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుని పట్టణవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కల్వర్టు నిర్మాణ పనులను ముమ్మరంగా సాగిస్తున్నారు. పాత బస్టాండులో ఈ కల్వర్టుల పనులు పూర్తి చేస్తే పట్టణంలో ఎక్కడా కూడా పారుతున్న మురుగునీరు కనిపించదు. మున్సిపల్ అధికారులు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్ని నెలల నుంచి ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పట్టణంలోని రైల్వేస్టేషన్‌తో పాటు బస్టాండ్ ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్‌తో వన్‌టౌన్ సీఐ మనోహర్ శనివారం తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌తో పాటు ప్రశాంతి, అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా చెక్ చేశారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరగకుండా ఈ తనిఖీలు చేశామని సీఐ చెప్పారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగ్‌లను, పరిసర ప్రాంతాలను, పార్శిల్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో వినాయక సర్కిల్, బళ్లారి బస్టాండ్, ఓల్డ్ బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలను డీఎస్పీ రవిబాబు బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో పట్టణ సీఐ యువరాజు పర్యవేక్షణలో క్షుణంగా ప


రాయదుర్గంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా అనుమానాస్పద వ్య క్తులు, వస్తువులు కనపడితే 100కు కానీ, 112కు కానీ డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

తాడిపత్రి: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ లోని రైళ్లల్లో, బస్సుల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టినట్లు ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు. ఇటీవల గంజాయిని ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లలో ఎక్కువగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ తనిఖీలు చేశామన్నారు. పార్శిల్‌సర్వీసులను కూడా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎక్కడి నుంచైనా గంజాయి తదితర మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, అలాగే వారికి పారితోషికం కూడా ఇస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆనంద్(ఫైల్)

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా పాడుబడిన రైల్వే క్వార్టర్స్‌లో శనివారం అనంతపురం కమలానగర్‌కు చెందిన దేవిరెడ్డి ఆనంద్(54)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్‌సీఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం కమలానగర్‌లో నివాసముంటున్న ఆనంద్ ఫొటో ల్యామినేషన్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసై తరచూ భార్య, కొడుకుతో గొడవపడేవాడన్నారు. దీంతో భార్య రాయదుర్గంలో పుట్టినింటికి వెళ్లిపోయిందన్నారు. రెండు నెలల ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆనంద్ కర్నూలు, గుంతకల్లుతోపాటు తదితర చోట్ల తిరుగుతూ ఉండేవాడన్నారు. శనివారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పాడుబడిన రైల్వే క్వార్టర్స్‌లోని ఇనుప రాడ్‌కు లైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సుజాత, ఒక కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాడికిలో మహిళ ..

యాడికి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కొండకింద వీధిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ వెంకటరమణయ్య తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండకింద వీధిలో శ్రీనివాసులు, తిప్పమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలి పనులకు వెళుతూ జీవనం గడుపుతున్నారు. అయితే కుటుంబ, ఆర్థిక సమస్యలతో కొద్దిరోజులుగా తిప్పమ్మ బాధపడుతుండేది. ఈ క్రమంలో శనివారం తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి కుళ్లాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిమ్మంపల్లిలో మరో మహిళ..

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఆస్తి విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపం చెందిన ఆమె శనివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడప జిల్లా పులివెందులకు తీసుకువెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ విషయంపై యల్లనూరు పోలీసులు వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం గ్రామంలో గల సుంకులమ్మ ఆలయం సమీపంలో కాశేపల్లికి చెందిన యువకుడు సుదర్శన్‌రెడ్డి (30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

రాయదుర్గం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, అధ్యాపకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అధికారుల నిలదీత

ఉరవకొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన సర్వసభ్య స మావేశం జరిగింది. ఇందులో తాగునీటి సమస్యపైన అధికారులను ఎంపీటీసీ సభ్యులు ఈశ్వర్‌బాబు, వన్నూరుసాబ్, వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు నిలదీశారు. గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా చేస్తే ప్రజలు ఎలా తా గుతారని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్యపై మం డిపడ్డారు. నీటి ట్యాంకులు శుభ్రం చేయ డం లేదన్నారు. ఇప్పటికైనా ట్యాంకులను శుభ్రం చేసి మంచి నీటిని వదలాలని కోరారు. నెరమెట్లలో సీపీడబ్ల్యూఎస్ స్కీం కింద నీరు సరఫరా చేయడం లేదని సర్పంచ్ యోగేందర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా.. ఉరవకొండ పట్టణంలో గత వైసీపీ హయాంలో నెలకు ఒక్కసారి నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం వా రానికి ఒక్కసారి వస్తున్నాయని స్థానిక ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యుడు పేర్కొనడం కొసమెరుపు. ఇక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని మార్చాలని సర్పంచులు ట్రాన్స్‌కో ఏఈ గురుమూర్తిని కోరారు. అలాగే వివిధ సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ రవిప్రసాద్, తహసీల్దార్ మహబూబ్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

తాడిపత్రి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఉమాపతిని శనివారం అరె స్టు చేసి, అతడి వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో అక్రమంగా మద్యంను అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఈ దాడులు చేశామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

● పుట్లూరు: మండలకేంద్రంలో అక్రమంగా మ ద్యం విక్రయిస్తున్న శేఖర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట నరసింహం తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఈ దాడులు చేశామని చెప్పారు.

12లీటర్ల సారా స్వాధీనం

యల్లనూరు: మండలంలోని కొడవండ్లపల్లి గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న వడ్డి తిరుపతిని అరెస్టు చేసి అతడి నుంచి 12లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి తెలిపారు. అనంతరం అతడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఈ దాడులు చేసినట్లు పేర్కొన్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లకండి: ఏఎస్పీ

పెద్దవడుగూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పేచర్లలో శనివారం ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి ప ర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా అందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీసులకు చెప్పాలన్నారు. అందరూ గ్రామాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాల్యవివాహాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్పీ భవనంలో శనివారం సాధన పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఇందులో టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్, జిల్లా బాలల పరిరక్షణ సమితి చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం వెంకటేశ్వరి పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. బాలికలు మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతారని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన అక్షయ తృతీయ ఉన్నందున జిల్లాలో ఎక్కువ బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు.


పోసర్లను ఆవిష్కరిస్తున్న సీఐ తదితరులు

అలాగే తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని, సెల్‌ఫోన్లకు, డ్రగ్స్‌కు ఇతరత్రా చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా జాగ్రత్తలు పడాలని తెలిపారు. అనంతరం టుగెదర్ బెటర్ ఇన్‌ట్రెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. హ్యాండ్స్‌కోఆర్డినేటర్ నాగలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ మునెమ్మ, వివిధ సంఘాల లీడర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, అష్టోత్తరాలు జరిపి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేకపూజలు చేసి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులుపెద్దఎత్తున స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు.

బొలికొండ రంగనాథుడికి..


ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

గుత్తిరూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు జరిపారు. అనంతరం మహామంగళ హారతినిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీ నరసింహస్వామికి కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు


గరుడవాహనంపై దేవేరులతో ఊరేగుతున్న స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ సన్మానం


విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

ఉరవకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం-2కు చెందిన వీ.తేజశ్విని ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 543మార్కులు సాధించింది. ఇందుకు గాను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఆ విద్యార్థినిని కలెక్టర్ వినోద్ కుమార్ శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, హాస్టల్ వార్డెన్ రామలక్ష్మి, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతకల్లు-చిక్జాజుర్ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు


ట్రాక్ మరమ్మతులను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని గుంతకల్లు-చిక్జాజుర్ సెక్షన్‌లో ట్రాక్ ప్రమాణాలు, రైల్వే స్టేషన్ల పనితీరును డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా శనివారం పరిశీలించారు. గుంతకల్లు నుంచి ప్రత్యేక రీర్ విండో బోగీలో బయలుదేరిన డీఆర్ఎం ఈ సెక్షన్‌లో ట్రాక్ నాణ్యతను తనిఖీచేశారు. అలాగే వివిధ స్టేషన్లను సందర్శించారు. ట్రూ ఫార్మేషన్ ట్రీట్మెంట్ అండ్ రిహ్యాబిటేషన్ (టీఎఫ్‌టీఆర్) యంత్రం ద్వారా జరుగుతున్న ట్రాక్ మరమ్మతు పనులను తిలకించారు. కార్యక్రమంలో ఆపరేటింగ్, మెకానికల్, కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

యాడికి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సీఎస్‌డీటీ సూర్యనారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా ఈకేవైసీ పెండింగ్ ఉన్న రేషన్ లబ్ధిదారులు 2196మంది ఉన్నారని అన్నారు. వారందరూ ఈనెలాఖరులోగా తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. అలా చేయించని వారికి సరుకుల సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. రేషన్‌డీలర్ల వద్ద గానీ, వీఆర్వోల వద్ద గానీ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని వారు తెలిపారు.

● రాయదుర్గం: మండల, అర్బన్ పరిధిలోని రేషన్‌కార్డుదారులు రెండురోజుల్లోగా ఈకేవైసీని చేయించుకోవాలని తహసీల్దార్ నాగరాజు ప్రకటనలో తెలిపారు. రేషన్ దుకాణం వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

గుత్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆ సాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన ఎస్‌ఐ సురేష్‌తో కలిసి మాట్లాడారు. డ్రోన్ కెమెరాల ద్వారా అనుమానస్పద ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా వేసి పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే బహిరంగంగా మద్యం సేవించే వారిపై, పేకాట ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా కోడిపందెలు,పేకాట, తదితర కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు తెలిస్తే 9346010582, 9346917082కు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు.

9.8 మిల్లీ మీటర్ల వర్షపాతం

బెళుగుప్ప, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు శనివారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు పొలాల్లో వేసవి దుక్కులు చేయడానికి అవకాశం కలిగిందని పలువురు రైతులు పేర్కొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ

గుత్తి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై జరిపిన దాడులకు నిరసనగా పట్టణంలోని ముస్లింలు శనివారం రాత్రి ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాల చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ప్రారంభమైన ర్యాలీ గాంధీ సర్కిల్ వరకు కొనసాగించారు. అనంతరం అక్క డ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరవత్తం కాకుండా ప్రభు త్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. అమాయక పర్యాటకులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● రాయదుర్గం: పట్టణంలో ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. అరబిక్ కళాశాల వద్ద నుంచి వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మీబజార్ వరకు ర్యాలీని కొనసాగించారు. నల్లరిబ్బన్లు ధరించి జాతీయజెండాలను చేతపట్టి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ సమైఖ్యత వర్థిల్లాలని, ఉగ్రవాదం నశించాలని కోరారు. ఖాజీలు సైపుల్లా, అతావుర్ రెహ్మాన్‌లతో పాటు పలువురు మైనార్టీలు పాల్గొన్నారు.


గుత్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


తాడిపత్రిలో..

● తాడిపత్రి: పట్టణంలో ముస్లింలు పెద్దఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బండామసీదు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్‌స్టేషన్ సర్కిల్ మీదుగా అశోక్‌పిల్లర్ వరకు సాగింది. అక్కడ పలువురు మాట్లాడుతూ.. దాడిచేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. అమాయక టూరిస్టులను అమానుషంగా కాల్చి చంపడం హేయమైన చర్యగా అభివర్ణించారు.